విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 05 మార్చి 2025 8 పేజీలు

రాజశేఖరంను వరించిన 'రాజకీయం'

- ప్రశాంతంగా పూర్తయిన పట్టభద్రుల కౌంటింగ్ ప్రక్రియ
- 77461 ఓట్ల మెజార్టీతో టిడిపి అభ్యర్థి గెలుపు
- 8వ రౌండ్‌తో తేలిపోయిన అభ్యర్థుల భవితవ్యం
- 1,99,208 వ్యాలీడు ఓట్లుగా గుర్తింపు
- 19,789 చెల్లని ఓట్లు

విశాలాంధ్రప్రతినిధి-ఏలూరు/కాకినాడ: ఎట్టకేలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి రాజశేఖరంను రాజకీయం వరించింది. ఉభయగోదావరి జిల్లాల్లో హెూరాహెూరీగా సాగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సోమ, మంగళ వారాల్లో స్థానిక సర్ సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల పరిశీలకులు శ్రీధర్, రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో నిర్వహించారు. 28 టేబుళ్లపై సోమవారం ఉదయం 8.00 గంటలకు ప్రారంభిం చిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటకు పూర్తయ్యింది. ఆది నుండి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తన ఆధిక్యతను చాటుకుంటూ ఉన్నారు. తొలి రౌండ్‌లోనే 16 వేల ఓట్లు ఆధిత్యంతో రాజశేఖరం నిలవ డంతో ఎమ్మెల్సీగా ఆయన గెలుపు ఖాయమని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. అందుకు అనుగుణంగానే కౌంటింగ్ ప్రారంభమై 8వ రౌండ్ పూర్తయ్యే సరికి రాజశేఖరం 77461 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థి రాఘువులపై విజయ బావుటా ఎగుర వేశారు. మొత్తం పోలైన 1,99,208 ఓట్లు గుర్తింపు ఓట్లుగా పరిగణలోకి తీసుకోగా, 19,789 చెల్లని ఓట్లుగా గుర్తించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు నింపే విషయమై జిల్లా అధికారులు అనేక పర్యాయాలు అవగాహన కల్పించినప్పటికీ సుమారు 20 వేల ఓట్లు చెల్లని విగా పోలవడంతో అభ్యర్థులలో మెజార్టీకి కొంత నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు. వాస్తవానికి ఉభయ గోదావరి జిల్లాలో 3 లక్షల 14 వేల మంది పట్టభద్రుల ఓటర్లుగా నమోదు కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన ▶మిగతా 2లో..

ప్రభుత్వాసుపత్రిలో పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ షన్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆసుపత్రి సిబ్బందితో ఆయన సమీక్షించారు. కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న నాబార్డ్, ఇతర సివిల్ వర్క్స్ పై కలెక్టర్ ఏపీఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరి హెల్త్, కాకినాడ జిల్లా పరిధిలోని ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఆసుపత్రిలో పనులు ▶మిగతా 2లో..

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా వివిధ సబ్సిడీ రుణాల మంజూరుకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ ఆయా కార్పొరేషన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులను గుర్తించి నియోజకవర్గాల వారీగా జాబితాలను సిద్ధం చేయాలన్నారు. రుణాలు అన్ని మార్చి 31లోపు గ్రౌండింగ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాల మహిళలకు ▶మిగతా 2లో..

ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సమ్మె

విశాలాంధ్ర -తణుకు: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ ఐదు నెలలు వేతన బకాయిలు, 29 నెలల పి.ఎఫ్ బకాయిలు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. 150 పడకల జిల్లా కేంద్ర హాస్పిటల్ స్థాయి కనుగుణంగా మరో 50 మంది కార్మికులను అదనంగా నియమించాలని డిమాండ్ చేసారు. కార్మికులపై వేధింపులు విడనాడాలని కోరారు. సమ్మె శిబిరం వద్దకు విచ్చేసిన ఏపీ వైద్య విధాన పరిషత్ పశ్చిమ గోదావరి జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ రాజుకు డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయ కులు డి. పుష్పలత, సీహెచ్ మంగమ్మ, పి. విజయలక్ష్మి,వై. రత్నం,వెంకటలక్ష్మి, బేబీ, చిన్నా, రేణుక, ఎన్.లక్ష్మి, లక్ష్మణరావు, చింతాలు తదితరులు సమ్మెకు నాయకత్వం వహించారు.

సమ్మె విరమణ

పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ రాజు సమక్షంలో కాంట్రాక్టు ప్రతినిధులకు యూనియన్ ప్రతినిధులకు జరిగిన చర్చల ఫలితంగా విధులు బహిష్కరణ విరమించి బుధవారం నుంచి కార్మికులు విధులకు హాజరు కానున్నట్టు యూనియన్ అధ్యక్షులు కోనాల భీమారావు చెప్పారు. డీసిహెచ్ఎస్ సమక్షంలో కాంట్రాక్ట్ ప్రతినిధులు, కార్మిక సంఘ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో ఈ నెల 10 వతేదీ నాటికి వేతన బకాయిలు, పిఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమచేయడానికి అంగీకరిస్తూ ఈమేరకు మినిట్స్ ఇవ్వడానికి అంగీకారం తెలపడం, జిల్లా కేంద్ర హాస్పిటల్ స్థాయి కనుగుణంగా అవసరమైన పారిశుధ్య కార్మికుల నియామకం త్వరితగతిన చేపడతామని డీ. సీహెచ్ఎస్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె తాత్కాలికంగా విరమించినట్టు భీమారావు చెప్పారు. ఇచ్చిన హామీ నెరవేర్చక పోతే ఈనెల 11వ తేదీ నుంచి మరలా సమ్మెకు సమాయత్తం అవుతామని స్పష్టం చేసినట్టు భీమారావు చెప్పారు.

24న పొగాకు వేలం కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర-దేవరపల్లి: ఎన్ఎల్ఎస్ పొగాకు వేలం కేంద్రాలు మార్చి 24న ప్రారంభం కానున్నట్లు రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జి ఎల్ కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వణాధికారి హేమ స్మిత పేర్కొన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రీజనల్ మేనేజర్ జి ఎల్ కే ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు వేలం కేంద్రాలు మూడు దశలలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మార్చి 24న ఎన్ఎల్ఎస్ ఏరియాలో దేవరపల్లి జంగారెడ్డిగూడెం ఒకటి, జంగారెడ్డిగూడెం -2, కొయ్యలగూడెం, గోపాల పురం వేలం కేంద్రాలలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మార్చి 10న ఎస్బిఎస్ రీజియన్లో ఒంగోలు 1, కొండేపి ఎస్ఎల్ఎస్ రీజియన్లో పొదిలి కందుకూరు వన్ మార్చి 19న ఎస్బిఎస్ రీజియన్లో ఒంగోలు టు టంగుటూరు బెల్లంపల్లి ఎస్ఎల్ఎస్ కందుకూరు టు కలిగిరి, డిసిపల్లి కనిగిరి వేలం కేంద్రాలలో పొగాకు వేలం ప్రారంభం కానున్నాయని జి ఎల్ కే ప్రసాద్ తెలిపారు. రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి మెండెలు తిరగవేసుకుని గ్రేడింగ్ చేయాలని అన్నారు. పొగాకులో ▶మిగతా 4లో..

హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి
- రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ గీత
- అడిషనల్ ఎస్పీ భాస్కరరావుకు వినతి పత్రం

విశాలాంధ్ర - కాకినాడ : హోంగార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలని కాకినాడ అడిషనల్ ఎస్పీ భాస్కరరావుకి ఆయన కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ గీత, కాకినాడ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. వీరబాబు, బోండా మైకేల్, వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ముందు ఉమ్మడి రాష్ట్రంగా ఉండేటప్పుడు హోంగార్డులు రాష్ట్రం నలుమూలల పనిచేసేవారని తెలిపారు. రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు తెలంగాణలో, తెలంగాణలోని హోంగార్డులు ఆంధ్రప్రదేశ్లో ఉండిపోయా రని రాష్ట్రం విడిపోయి 11 సంవత్సరాలు అయ్యింద న్నారు. వారు సొంత రాష్ట్రాలకు రావాలని కోరుకుంటు న్నారన్నారు. ఈ రాష్ట్రంలో ఉద్యోగం, ▶మిగతా 4లో..

తప్పిపోయిన బాలురు తల్లిదండ్రులకు అప్పగింత

విశాలాంధ్ర - గణపవరం: తప్పిపోయిన ఇద్దరు బాలుర ఆచూకీని గణపవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఒక గంట వ్యవధి లోనే తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు గణపవరం ఎస్ఐ ఎ. మణి కుమార్ మంగళవారం తెలిపారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన 14 సంవత్సరాలు,13 సంవత్సరాలు వయసు కలిగిన ఇద్దరు బాలురు సోమవారం

రాత్రి 8 గంటల నుండి కనపడటం లేదని బాలురు అమ్మమ్మ పూడి కాంతమ్మ డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. ఈ విషయాన్ని సిఐ ఎం. సుభాష్, ఎస్ఐ ఎ. మణికుమార్ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని గణప వరం పోలీస్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ దాసరి రత్న ప్రసాద్, పిసి పి.కాంతయ్య, హెచ్‌జి ఎం. సతీష్ తక్షణమే స్పందించి, పిప్పర గ్రామంలో అన్వేషణ జరిపి, ఒక గంట వ్యవధిలోనే ఇద్దరు బాలురను వెతికి, కుటుంబ సభ్యులకు అప్పగించారని ఆయన తెలిపారు.

ఆడపిల్లలకు పెళ్లీడు వయస్సు వచ్చిన తర్వాత వివాహాలు చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి ఆడపిల్లకు పెళ్లి ఈడు వయస్సు వచ్చిన తర్వాత వివాహాలు చేయాలని, అప్పుడు రక్తహీనత లేకుండా ఉంటారని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పిహెచ్‌సిలో ఆశాడే నెలవారి సమీక్ష సమావేశం ఆశా కార్యకర్తలకు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు, ఏఎన్ఎంలకు నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్తహీనత లేకుండా ఆకుపచ్చని ఆకుకూరలు తీసుకొనుట వలన యుక్త వయసు ఆడపిల్లలు రక్తహీనత లేకుండా ఉంటారని, ప్రతి ఆశా దగ్గర ప్రెగ్నెన్సీ కిట్స్ కనీసం 10 ఉండాలని, ఎన్ సి డి, సిడి సర్వే ఈ నెలాఖరులోపు స్క్రీనింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రి ప్రసవములు పెంచాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.తులసి, సిహెచ్ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు పట్ల హర్షం

విశాలాంధ్ర-టి నరసాపురం: కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజ శేఖరం,ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు పట్ల తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీ రామమూర్తి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీ నారాయణ, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పట్టభద్రులు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించారని వారు తెలిపారు.

PASSPORT LOST
I, PONNAMANDA ANTONY, S/o PANDU, D.No.2-70, Deyyalatippa Village, Bhimavaran Mandal, W.G.Dist-534202. I have recently lost my original PASSPORT bearing **No.N9109201** while I was going from my House to Balusumudi, Bhimavaram. If anybody finds kindly inform to the above address. **Contact : 72078 44334**

సిద్ధం చేయాలి

(1వ పేజీ తరువాయి)

ఉన్నతి పథకం కింద బ్యాంకు కన్సెట్ లేకుండా 120 యూనిట్లు మంజూరుకు రూ. 3.60 కోట్లు, వీటితో పాసింజర్ ఆటోలను కొనుగోలు చేయవచ్చు అన్నారు. ఎస్సీ జనరల్ కేటగిరీలో 714 యూనిట్లు కొనుగోలుకు రూ. 24.39 కోట్లు మంజూరు చేయగా, సరుకులు రవాణా వాహనాలు కొనుగోలుకు ఒక్కొక్క యూనిట్‌కు రూ. 3 లక్షల వరకు మంజూరు చేయవచ్చని, టైప్-1 కేటగిరిలో 50 శాతం సబ్సిడీ, టైప్ -2 కేటగిరిలో 40 శాతం సబ్సిడీ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు యూనిట్లు నెలకొల్పేందుకు 60 శాతం సబ్సిడీ, ఐ ఎస్ బి యూనిట్లకు టైప్-1 60 శాతం, టైప్-2 లకు 40 శాతం సబ్సిడీ, వ్యవసాయ పరికరాలు కొనుగోలుకు 50 శాతం సబ్సిడీ పై రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సమావేశంలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయప్రకాష్, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్ప రాణి, ఎల్ డి ఎం ఎ.నాగేంద్ర ప్రసాద్, డి వై ఆర్ హెచ్ ఎం.వెంకన్న బాబు, అగ్రికల్చర్ ఏవో టెక్నికల్ రమేష్ నాయుడు, బ్యాంకర్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూర్తిచేయాలి

(1వ పేజీ తరువాయి)

ఏమేమి మంజూరు అయ్యాయి, ఎంతవరకు పూర్తి అయ్యాయి, ఎప్పటికి పూర్తి అవుతాయి వాటి ప్రస్తుత స్థితి గతులు, పూర్తి అయినవి ఆసుపత్రులకు అప్పగించార లేదా తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని మరల దీని గురించి రెండు వారాల తరువాత సమీక్ష ఉంటుందని తెలియచేశారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నరాజు, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ స్వప్న, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరి హెల్త్, కాకినాడ జిల్లా పరిధిలోని ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం

(1వ పేజీ తరువాయి)

జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2 లక్షల 18,997 వేల మంది పట్టభద్రులు ఆరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన 456 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియో గించుకున్నారు. అనంతరం ఈ నెల మూడో తేదీ నుండి ఏలూరులోని సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కార్యక్ర మానికి 700 మంది అధికారులు, సిబ్బందిని కౌంటింగ్ విధులకు కేటాయించి నాలుగు గంటల పాటు కౌంటింగ్ కొనసాగే విధంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వెట్రి సెల్వి పటిష్ట చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్‌ను 17 రౌండ్లలో పూర్తిచేసేందుకు 28 టేబుల్స్ కేటాయించారు. 3వ తేదీ ఉదయం నుండి కౌంటింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విధంగా 3వ తేదీ రాత్రి 9:30 గంటల సమయానికి కట్టలు కట్టిన బ్యాలెట్ పత్రాలను ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ ప్రారంభించగా 4వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 8వ రౌండ్ పూర్తికాగా బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం కూడా తేలిపోయింది. మొదటి స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నిలిచి ఎమ్మెల్సీగా గెలుపొందగా రెండో స్థానంలో 47 వేల ఓట్లతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో దిడ్ల రాఘవులు నిలిచారు. మూడో స్థానంలో 16 వేల ఓట్లతో సుందరం నిలిచారు. కాగా ఈ ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల పరిశీలకులు శ్రీధర్, రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్పీ కెపిఎస్.కిషోర్ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో నిర్వహించారు. ఇందులో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు 1,24,702 ఓట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో పోటీచేసిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు 47,241 ఓట్లు, జివి. సుందర్ కు 16,183 ఓట్లు లభించాయి. మొత్తం 8 రౌండ్లలో 1,24,702 ఓట్లతో పేరాబత్తుల రాజశేఖరం సాధించారు. ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రాజశేఖరంకు ధ్రువపత్రాన్ని అందజేశారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డిఎస్పీ శ్రావణ కుమార్ సమర్థవంతంగా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభ్యర్థుల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇవే

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి రౌండులో 16,520, రెండవ రౌండులో 16,212, 3వ రౌండ్‌లో 16,191, 4వ రౌండ్ లో 15,482, 5వరౌండ్ లో 15,632, 6వ రౌండ్ లో 16,254, ఏడవ రౌండ్ లో 16,040, 8వ రౌండ్ లో 12,371 కలిపి మొత్తం 1,24,702 ఓట్లు లభించాయి. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి రౌండులో 5,815, రెండవ రౌండులో 5,421, 3వ రౌండ్ లో 5,570, 4వ రౌండ్ లో 6,446, 5వరౌండ్ లో 6,413, 6వ రౌండ్ లో 5,949, ఏడవ రౌండ్ లో 5,654, 8వ రౌండ్ లో 5,973 మొత్తం 47,241 ఓట్లు లభించాయి. అలాగే జివి.సుందర్ కు మొదటి రౌండులో 1,968, 2వ రౌండులో 2,238, 3వ రౌండ్ లో 2,119, 4వ రౌండ్ లో 2,484, 5వ రౌండ్ లో 2,208, 6వ రౌండ్ లో 1,741, 7వ రౌండ్ లో 2,106, 8వ రౌండ్ లో 1,319 మొత్తం 16,183 ఓట్లు లభించారు. అదే విధంగా కాట్రు నాగబాబు 565, షేక్ హుస్సేన్ 394, కట్టా వేణుగోపాల కృష్ణ 1,017, కాండ్రేగుల నరసింహం 364, కాళ్ళూరి కృష్ణమోహన్ 190, కుక్కల గోవిందరాజు 269, కునుకు హేమకుమారి 956, కైల లావణ్య 365, గౌతం బాబు కొల్లు 317, చిక్కాల దుర్గారావు 665, తాళ్లూరి రమేష్ 201, దత్తాత్రేయ నోరి 567, దొరబాబు యాళ్ల 303, నీతిపూడి సత్యనారాయణ161, పినిపే నాగభూషణ వర్మ 68, పిప్పళ్ళ సుప్రజ 479, పేపకాయల రాజేంద్ర (శుభ) 199, బొడ్డు శ్రీనివాసరావు 152, బొమ్మన బోయిన వివిఎస్ఆర్.మూర్తి 119, బొమ్మిడి సన్నీరాజ్ 398, బందారు రామమోహన్ రావు 709, భీమేశ్వరరావు చిక్కా 254, మాకి దేవీప్రసాద్146, మెర్ల శాస్త్రులు 103, మోకన అంబేద్కర్ 129, రాజాపూడి 95, జిటి.రామారావు 39, రేవులగడ్డ ముఖేష్ బాబు 96, వానపల్లి శివగణేష్ 772, శ్రీనివాస్ విష్ణువర్ధుల 190, యం. శ్రీనివాసరావు (యంఎస్ఆర్) 41, హసన్ షరీఫ్‌లకు 759 ఓట్లు పోలయ్యాయి.

నూరు శాతం ఫలితాలకు కృషి

- సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్
- సహాయ సంక్షేమ శాఖ అధికారి వెల్లడి

విశాలాంధ్ర-లింగపాలెం: సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పదవతరగతి చదివే విద్యార్థులు ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించే ప్రణాళికతో చర్యలు తీసుకున్నామని చింతలపూడి సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి టి.రత్నకుమార్ తెలిపారు. వసతి గృహాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఈయన వివరించారు. చింతలపూడి సాంఘిక సంక్షేమ సహాయ శాఖ పరిధిలో 8 వసతి గృహాలు ఉన్నాయని ఈ ఏడాది ఈ వసతి గృహాల నుంచి 156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో 87 మంది బాలురు, 69 బాలికలు ఉన్నారని తెలిపారు. గత ఏడాది 98శాతం ఉత్తీర్ణత వచ్చిందని, ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. సులువుగా మార్కులు సాధించే విధానంపై ప్రతిభావంతులైన బోధకుల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో ఆందోళన కలగకుండా, మానసిక ఒత్తిడి లేకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. పరీక్షలు రాసే విద్యార్థు లకు పోషకాలు కలిగిన ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నా మని అన్నారు. ప్రత్యేక ట్యూటర్లు ద్వారా ప్రతి సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపార చింతల పూడి మండలంలో మూడు, లింగపాలెం మండలంలో మూడు, కే.కోట మండలంలో రెండు వసతి గృహాల నుంచి పదవతరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు.

డీఎన్నార్‌కు వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025

విశాలాంధ్ర -భీమవరం: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 నిర్వహించడానికి నోడల్ కళాశాలగా తమకు అవకాశం దక్కిందని డి.ఎన్.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ తెలిపారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నుండి యూత్ పార్లమెంటులో 18 నుండి 25 సంవత్సరాలు పూర్తి అయిన వారు పాల్గొనవచ్చని తమ పేర్లను మైభారత్.గవ్.ఇన్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వివరించారు. వికసిత్ భారత్ అనే అంశం పై ఒక నిమిషం నిడివి కలిగిన వీడియోను అప్లోడ్ చేయాలని ఆయన పేర్కొన్నారు. పోర్టల్ లో నమోదయిన వారిలో 150 మందిని స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తమ కళా శాలలో పోటీలు నిర్వహించి ఎంపికైన 10 మందిని రాష్ట్ర స్థాయికి పంపుతామని మరిన్ని వివరాలకు 8179179899, 9441388058 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీనివాసనాయుడుకు అభినందనలు

విశాలాంధ్ర -కామవరపుకోట: ఉత్తరాంధ్రలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా విజయ సాధించిన గాది శ్రీనివాస నాయుడు ఘన విజయాన్ని సాధించడం పట్ల ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి, బిజెపి, జనసేన పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని ఓడించటాన్ని కూటమి ప్రభుత్వం అదొక హెచ్చరికగా భావించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచడం కోసం ప్రజా అనుకూలంగా పాలించాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది మాసాలలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూటకట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం, ప్రతి రైతుకు ఏడాదికి తమ బ్యాంకు ఖాతాల్లో 20 వేల రూపాయలు జమ చేస్తామని ప్రతి మహిళకు ఏడాదికి 20 వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన కూటమి ప్రభుత్వానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మిత్రులు బెత్తం చేత పట్టుకుని వార్నింగ్ ఇచ్చినట్లుగా కూటమి పెద్దలు భావించా లని ఏఐటీయూసీ నాయకులు కూటమి పెద్దలకు హితవు పలికారు.

అధికారులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ అత్యంత నైపుణ్య పద్ధతిలో శాంతియుతంగా, విజయవంతంగా పూర్తిచేశామని దీనికి సహకరించిన అందరికి అభినందన లని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడంలో అధికారులు ,సిబ్బంది అందరూ టీమ్ స్పిరిట్ తో అద్భుతంగా పనిచేశారన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా మొదలుకొని కౌంటింగ్ ముగిసే వరకు సంబంధిత అధికారులందరి సమష్టి కృషితోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందన్నారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొని తమవంతు పాత్ర పోషించారన్నారు. ఎన్నికల నిర్వహణలో పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 6 జిల్లాల యంత్రాంగం అందించిన సహకారం అభినందనీయమన్నారు. పోలీస్ యంత్రాంగం అవిరళకృషి చేసిందని, ఈ సందర్భంగా పోలీస్ యంత్రాంగానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో సహకరించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

దివ్యదుర్గకు సత్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎస్సై ఉద్యోగం సాధించిన దివ్య దుర్గను కొయ్యలగూడెం మండల శ్రీ విలియం హెూ గణపతి రామ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆమె గృహం వద్ద మర్యాద పూర్వకంగా కలుసు కొని సత్కరించారు. మండలంలో కన్నాపురం గ్రామానికి చెందిన గుదే దివ్య దుర్గ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా శిక్షణ ముగించుకొని తన స్వగ్రామమైన కన్నాపురం రావడంతో ఆమెను టైలర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడుతూ దివ్య దుర్గ తండ్రి ప్రసాద్ టైలర్ వృత్తి కొనసాగిస్తూ ఉంటారని, సామాన్య కుటుంబంలో పుట్టి మంచి విద్యను అభ్యసించి, సబ్ ఇన్స్పెక్టర్‌కు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మండలంలో మొట్టమొదటి మహిళా ఎస్సైగా దివ్య దుర్గ కావడం ఆనందదాయకమని అన్నారు. ఉద్యోగంలో రాణించి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చి అంచలంచెలుగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెప్పుల మధుబాబు, ఖాసిం, సంకు కృష్ణ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేరాబత్తులకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర -భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల కేంద్ర ఉక్కు , భారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరం ఘన విజయానికి కృషిచేసిన పట్టభద్రులకు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రులు ఏ ఆకాంక్షల కోసమైతే కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించారో వాటి సాధనకు ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కార్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు యువత సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు అనటానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజేంద్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థానం నుండి పేరాబత్తుల రాజశేఖరంలు తొలి ప్రాధాన్యత ఓట్లతో భారీ మెజార్టీతో గెలుపొందటమే నిదర్శనమని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఆటో కార్మికుల నిరసన

విశాలాంధ్ర -భీమవరం: ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు ఎన్నికల సందర్భంగా కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏఐటీయుసి అనుబంధ ఏ.పి.ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ ఆటో కార్మికులకు గుదిబండగా ఉన్న జిఓ నెంబర్ 2131ను రద్దు చేయాలని, వాహన మిత్రలకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు యాక్ట్ చట్టం 106(1)(2)ను రద్దు చేయాలని చెల్లబోయిన డిమాండ్ చేశారు. జిఆర్ఎస్ 124(ఇ), 894 నోటిఫికేషన్ ఉపసంహరించాలని, టాటా ఏస్, కార్లు జీపులపై, భారీగా పెంచిన రోడ్ టాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్ టోల్గేట్ ఫీజులను 30 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్, మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలని చెల్లబోయిన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కదలి హరిబాబు, అధ్యక్షులు చెన్నంచెట్టి వాసు, ఉపాధ్యక్షులు జయకుమార్, కార్యదర్శి వీరవల్లి శ్రీను, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఆటో అండ్ మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మంగళవారం స్థానిక హౌసింగ్ బోర్డ్ సెంటర్‌లో ఎస్.వి. రంగారావు సర్కిల్ వద్ద అనుబంధ మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏ.ఐ.టి.యూ.సి. అనుబంధం) ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి ఏరియా కార్యదర్శి మండలపర్తి హరీష్ మాట్లాడుతూ విచ్చలవిడి చలానాలతో డ్రైవర్లను వేధిస్తున్న జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని, వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జి ఆర్ ఎస్ 124 నోటిఫికేషన్ 8 94 నోటిఫికేషన్ డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు యాక్ట్ చట్టం 106(1)(2) ను రద్దు చేయాలని, టాటా ఏస్ , మ్యాజిక్ వ్యానులు, కార్లు జీపులపై భారీగా పెంచిన రోడ్ టాక్స్ , థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, టోల్గేట్ ఫీజులను 30 శాతానికి తగ్గించాలని, డ్రైవర్ల పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలని,ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ తో కూడిన సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రుల యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె లక్ష్మీనారాయణ ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సి డబ్ల్యు సి వర్కర్స్ యూనియన్ నాయకులు తాడేపల్లి వెంకటేష్, అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కర్రి.సత్యనారాయణ, కార్యదర్శి తాడేపల్లి అప్పలరాజు, ఎస్.రాజు, ఎం.అచ్చిబాబు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. తదనతరం పై సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిశీలించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర -భీమవరం: పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులపై పూర్తిస్థాయి నిషేధం ఉన్న కారణంగా క్రయ విక్రయాలపై దృష్టి సారించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయ వస్తువులపై ప్రజల్లో అవగాహన కలిగించాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. నూరు శాతం ప్లాస్టిక్ నిషేధం అమలుపై మంగళవారం శానిటరీ ఇన్స్పెక్టర్లకు, శానిటేషన్ సెక్రటరీలు, హోల్ సేల్ షాపు డీలర్లతో కమిషనర్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు క్రయ విక్రయాలు జరిపే వారిపై పెద్ద మొత్తంలో పెనాల్టీలు విధించి, షాపు లైసెన్స్ క్లోజ్ చేయాలని ఆదేశించారు. చెత్తను షాప్ బయట, రోడ్లపై పారవేసినా, షాపులో చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోని షాపులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

ఉత్తమ లైన్‌మెన్‌గా నాగరాజు

పలువురి అభినందనలు

విశాలాంధ్ర -కామవరపుకోట: మండల కేంద్రంలో విద్యుత్ లైన్ మెన్ గా సేవలందిస్తున్న నాగరాజు విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఉత్తమ లైన్మెన్‌గా అవార్డు పొందారు. లైన్మెన్ నాగరాజుకు ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షుడు టీవీఎస్ రాజు అభినందనలు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎవరైనా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోయినా విద్యుత్ స్తంభం పై సర్వీస్ వైర్ కట్ అయినా వినియోగదారులు లైన్మెన్ నాగరాజుకు ఫోన్ చేసిన నిమిషాల్లో వినియోగదారుల ముందు ప్రత్యక్షమై అవసరమైతే విద్యుత్ స్తంభం ఎక్కి సర్వీస్ వైర్‌ను విద్యుత్ తీగలకు కనెక్ట్ చేసి వినియోగదారులకు వెంటనే విద్యుత్ అందించే నాగరాజుకు భవిష్యత్తులో మరెన్నో అవార్డులు స్వీకరించాలని టీవీఎస్ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-పోలవరం : గంటల వ్యవధిలోనే తప్పిపోయిన బాలుడు ఆచూకీని పోలవరం పోలీసులు కనుగొన్నారు. పోలవరం ఎస్సై పవన్ కుమార్ కథనం ప్రకారం పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ బంగారం పేట గ్రామానికి చెందిన కల్లపల్లి మేఘ సాయి అశ్వత్ (12) సోమవారం తెల్లవారుజామున తన తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటిలో నుండి పారిపోయా డన్నారు. తల్లితండ్రులు లోకేష్, భావన ఉదయం చూసేసరికి అశ్వత్ కనపడకపోవడంతో పోలవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని చెప్పారు. అశ్వత్ ఇంటి నుండి వెళ్ళేటప్పుడు ఒక కాగితంలో నావల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు, నేను ఇంట్లో నుండి విజయవాడ వెళ్ళిపోతున్నాను మళ్లీ నా పుట్టిన రోజున వస్తానని కాగితంలో రాశాడన్నారు. వెంటనే వాట్సప్ గ్రూపుల్లో ప్రతి ఒక్కరికి షేర్ చేశామని చెప్పారు. నిడదవోలు బస్ కండక్టర్ తెల్లవారుజామున తన బస్సులో ఎక్కి తాళ్లపూడిలో దిగినట్లుగా చెప్పారన్నారు. ఇదే విషయాన్ని జిల్లా ఎస్పీకి తెలియపరిచామని, ఆయన ఆదేశాలతో బస్టాండ్ లో సీసీ కెమెరాల ద్వారా బాలుడు ఆచూకీ ఎమ్మెల్సీ బాధ్యతలు చేపట్టడానికి వెళ్లిన పోలీసుల ద్వారా సిసి పుటేజీలు పరిశీలించమని చెప్పామన్నారు. ఒక మహిళ వాట్సాప్ మెసేజ్ చూసి అశ్వత్ తాళ్లపూడి లో ఉన్నాడని పోలవరం ఎస్సైకి తెలియపరచగా వెంటనే వెళ్లి పోలవరం పోలీస్ స్టేషన్కు తీసుకుని వచ్చారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, బాలుడు ఆచూకీ తెలియడంతో కేసులు క్లోజ్ చేస్తామని చెప్పారు. పిల్లల తల్లి దండ్రులు పిల్లలతో సరదాగా రోజుకు ఒక అరగంట సేపు మాట్లాడాలని దాని ద్వారా పిల్లలకు మంచి నడవడిక వస్తుందన్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్ విజయం సాధించడానికి కృషిచేసిన కూటమి పార్టీల నాయకులందరికీ, కార్యకర్తలకు, ఓట్లు వేసి సహకరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రజలంతా పట్టం కట్టారని, నిరుద్యోగ యువతకు మంచి రోజులు వస్తున్నాయని, రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పేర బత్తుల రాంబాబు నిదర్శనం అని ఆయన తెలిపారు.

ఎరువుల షాపులు తనిఖీ

విశాలాంధ్ర - కలిదిండి: ఎరువుల షాపులలో కాల పరిమితి ముగిసిన ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేయాలని మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జి. వెంకటమణి తెలిపారు. మంగళవారం కలిదిండిలో ఎరువుల షాపులపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మారుతి ట్రేడర్స్, శ్రీ మస్తాన్ బాబా ఫెర్టిలైజర్స్, శ్రీ మారుతీ రామా ట్రేడర్స్ ఎరువుల షాపులను తనిఖీలు చేయగా శ్రీ మారుతీ రామ ట్రేడర్స్ ఎరువుల షాపులో కాలపరిమతి దాటిన సుమారు రూ.6 లక్షల విలువగల జింక్ ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. శ్రీ మస్తాన్ బాబా ఫెసిటిలైజర్స్ షాపులో కాల పరిమితి ముగిసిన రూ. 45 వేల విలువగల పొటాష్ అమ్మకం నిలుపుదల చేశామన్నారు. ఈ తనిఖీలలో కలిదిండి వ్యవసాయ శాఖ అధికారి కే. విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్ బాలకృష్ణకు పురస్కారం

విశాలాంధ్ర-భీమడోలు: మంగళవారం ఏలూరు విద్యుత్ భవన్ లో నిర్వహించిన లైన్మెన్ దివాస్ వేడుకలలో భాగంగా భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో విధుల్లో ప్రతిభ చూపిన బాలకృష్ణను ట్రాన్స్‌కో అధికారులు సత్కరించారు. ప్రతిఏటా మార్చి 4న నిర్వహించే జాతీయ లైన్మెన్ దివాస్ వేడుకలను ట్రాన్స్‌కో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు జిల్లాలోని లైన్‌మెన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.సాల్మన్ రాజు, ఈఈలు కేయం అంబేద్కర్, పి.ఎ.ఖాన్, పి.రాధాకృష్ణ, టి.శశిధర్, కె.శ్రీనివాస్,భీమడోలు ఏడీఈ కే.గోపాలకృష్ణ, ఏఈ వి వీ.శివాజీ బాలకృష్ణను అభినందించారు.

ఈదర విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: శారద ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కోలాటం పోటీలలో ఈదర ఉన్నత పాఠశాల విద్యార్థులు సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కందిపప్పు శారద తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను గ్రామ సర్పంచ్ అగిత ఏసుపాదం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కే అంజయ్య, విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సి హెచ్ జయ రావును అభినందించారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అనన్యం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ఉన్నత పాఠశాలలో గుడ్లవల్లేరు ఎస్ ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలికలకు మహిళా సాధికారత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ మహిళల భద్రత మరియు రక్షణ అనే అంశంపై ముందుగా మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనన్య సామాన్యమైనది కానీ, ఆరంభం నుండి ఇప్పటివరకు మహిళలు వివిధ రకాల సవాళ్లను ఎదుర్కొంటూ వస్తున్నారన్నారు. మహిళలకు భద్రత కల్పించటంలో వ్యక్తిగత జాగ్రత్తలు మాత్రమే కాకుండా, ప్రభుత్వ, కుటుంబ మరియు సమాజ స్థాయిలో మార్పులు రావాలని కోరారు. అలాగే డిజిటల్ యుగంలో మహిళల భద్రత, సామాజిక మాధ్యమాల్లో గోప్యత అనే అంశంపై మాట్లాడుతూ నేటి యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, మహిళలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో పాల్గొంటూ, తమ అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశాన్ని పొందుతున్నారన్నారు కార్యక్రమంలో గుడ్లవల్లేరు శక్తి టీమ్, మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆక్వా ఫీడ్ ధరలపై ప్రభుత్వ నియంత్రణ కరవు

- ముడి సరుకుల ధరలు తగ్గినప్పుడు ఫీడ్ ధరలు ఎందుకు తగ్గవు?
- ఆక్వా రైతులను ఆదుకోవాలి
- స్పందించకపోతే.. మహా ధర్నా

విశాలాంధ్ర - పాలకొల్లు : ఆక్వా రంగాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాలకొల్లు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘ కార్యాలయంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాంధీ రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత నెల ఫిబ్రవరిలో విజయవాడలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆక్వా సమావేశం నిర్వహించారని, ఈ సమావేశానికి తమ సంఘానికి ఎటువంటి ఆహ్వానం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏం చేస్తున్నారని, మరిచి పోయామని, పొరపాటు అయ్యిందని సంబంధిత అధికారులు చెప్పడం ఎంతవరకు సబబు అని గాంధీ రాజు ప్రశ్నించారు.

సమస్యలతో అల్లాడుతున్న ఆక్వారంగాన్ని ఆదుకోవడంలో అప్సర ముందుండాలని తాము భావిస్తున్నప్పటికీ, ఆ దిశగా విజయవాడ అప్సర ఆక్వా సంఘ సమావేశంలో చర్యలు చేపట్టకపోవ డం విచారకరమన్నారు. అసలు అప్సర ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన సమావేశం ఆక్వా సంఘాలకా, ఆక్వా రైతులకో తెలియని పరిస్థితి ఉండడం విచారకరమని చెప్పారు. మంత్రి నిమ్మల రామానాయుడు సారధ్యంలో త్వరలోనే మంత్రి అచ్చం నాయుడు ని కలిసి ఈ విషయమై ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. రైతుల సమస్యలను అచ్చం నాయుడుకు వివరిస్తామన్నారు. జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘాన్ని పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఎక్కడ వెనుకాడేది లేదని గాంధీ భగవాన్ రాజు తేల్చి చెప్పారు. ఆక్వా రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టకపోతే తమ సంఘం

ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ అతి త్వరలో ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆక్వా రైతుల నుండి రొయ్య కొనుగోళ్ల విషయంలో కావాలనే కృత్రిమ టైట్ సృష్టించారని, ఇది కరెక్ట్ కాదన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా అధికారులు ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు.

ముడి సరుకుల ధరలు తగ్గినప్పుడు ఫీడ్ ధరలు ఎందుకు తగ్గవని ప్రశ్నించారు. ఆక్వా రైతుల నుండి సరుకును కావాలనే కొనడం తగ్గించారని, కృత్రిమ టైట్ ను, సృష్టిస్తున్నారని చెప్పారు. ప్రొసెసింగ్ ప్లాంట్స్‌ను ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఉందని, స్వయంగా ప్రభుత్వమే ప్రొసెసింగ్ ప్లాంట్స్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కలగజేసుకుని ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బోణం వెంకట నరసయ్య (చినబాబు), మేడిది జాన్ డేవిడ్ రాజు, సజ్జా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పంపించాలి (1వ పేజీ తరువాయి)

ఆ రాష్ట్రంలో కుటుంబం ఉండడంతో ఆర్థికంగా భారం, పిల్లలకు దూరంగా ఉండవలసి వస్తోందని, కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 11 సంవత్సరాలైనా స్థానికతను కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారని చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హోంగార్డులను సొంత రాష్ట్రాలకు పంపించాలని కోరారు. అడిషనల్ ఎస్పీ భాస్కరరావు స్పందిస్తూ వెంటనే ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

ప్రారంభం (1వ పేజీ తరువాయి)

అన్యపదార్థాలు లేకుండా రైతులు విధిగా 150 కిలోలు మించి బేళ్లను తయారు చేయకూడదని తెలిపారు. 150 కేజీలు మించిన పొగాకు బేళ్లను తిరస్కరిస్తామని జి ఎల్ కే ప్రసాద్ తెలిపారు.

ఎన్ ఎల్ ఎస్ ఏరియాలో 11837 మంది రైతులు ఉన్నారని, 13789 పొగాకు బేరనులు ఉన్నాయని అన్నారు. 24138 హెక్టార్లలో పొగాకును పండిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్ ఎల్ ఎస్ ఏరియాలో 56.88 మిలియన్ కిలోల పొగాకు అనుమతి ఇచ్చామని రీజనల్ మేనేజర్ తెలిపారు. ఎన్.బి.ఎస్ ఏరియాలో 886 మంది రైతులు ఉన్నారని 965 బ్యారన్లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఎన్బిఎస్ ఏరియాలో 1776 హెక్టార్లలో పొగాకు పంట ఉందని ఆయన తెలిపారు. ఎంబిఎస్ 3.4 మిలియన్ కిలోలు పొగాకు ఉత్పత్తి అవుతుందని పొగాకు బోర్డు కూడా అనుమతి ఇచ్చిందని తెలిపారు ఎన్ ఎల్ ఎస్ ఎన్బిఎస్ మొత్తం 79.8 8 కిలోలు పొగాకు ఉత్పత్తికి అంచనా వేశామని జీఎల్కే ప్రసాద్ తెలిపారు.

ఎస్టీయూ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ గా ఆలపాటి రాజేంద్రప్రసాద్ అఖండ మెజార్టీతో విజయం సాధించడం పట్ల ఎస్.టి.యు ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ విజయానికి కృషి చేసిన ఎస్.టి.యు. కార్యకర్తలకు, మొదటి ప్రాధాన్యత ఓటునిచ్చి గెలిపించిన గ్రాడ్యుయేట్ ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్టీయూకి మద్దతు ఇచ్చిన వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్రంలో జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, కృష్ణ గుంటూరు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్టీయూ బలపరిచిన జి.శ్రీనివాసులునా యుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పి.రాజశేఖర్ లను అఖండమైన మెజారిటీతో గెలిపించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్లకు ఎస్టియు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో అయన మాట్లాడుతూ ప్రశ్నిస్తాం అంటూ దశాబ్దాల తరబడి కబుర్లు చెప్పిన నాయకులను నమ్మవద్దని, ఉద్యోగులకు నిరుద్యోగు లకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఫలితాలను ఇచ్చే వ్యక్తులను ఎన్నుకోవాల్సిందిగా ఎస్టీయూ ఇచ్చిన పిలుపు, చేసిన ప్రచారం మేరకు అద్భుతమైన విజయాన్ని ఓటర్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ ఎన్నికలో రాజకీయ పార్టీలు ప్రమేయం వద్దంటూ ఒకవైపు ప్రచారం చేస్తూ, మరో వైపు రాజకీయపార్టీల మద్దతు తెర వెనుకనుండి పొంద డాన్ని గ్రాడ్యుయేట్ లందరూ స్పష్టంగా గ్రహించి తగిన రీతిలో బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. హామీ మేరకు గెలిచిన అభ్యర్థులను ఉపాధ్యాయులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏ.ఎస్.వి ప్రసాద్, జిల్లా శాఖ సహధ్య క్షుడు పివిఎన్‌డి ప్రసాద్, గుడివాడ పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కె.జె డానియల్, ఆర్ మోహన్‌రావు, ఐ.అరవింద్, పరసా శ్రీను, మడకా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆటల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. మహిళ మూర్తులు ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయంగా ఉందని, శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కుమారి, కన్వీనర్ మాధవి, ఆల్ ఇండియా ఎన్ ఈసీ మెంబెర్ శాంతి శ్రీ, మహిళ ప్రతినిధులు శివ లీల, విజయశ్రీ, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్2 అధ్యక్షుడు ఎం. రాజబాబు, ఏపీ ఎన్జీవో నగర శాఖ అధ్యక్షులు సి వి.ఆర్ ప్రసాద్ ఉన్నారు.

సింగవరం ఇసుక ర్యాంపుపై గ్రామ సభ

విశాలాంధ్ర - సీతానగరం: సింగవరం ఇసుక ర్యాంపుపై గ్రామ సభకు హాజరైన తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు. మండలంలో సింగవరం గ్రామ పంచాయితీ పరిధిలో గోదావరి ఎడమ ఒడ్డున 34.4 హెక్టార్ల విస్తీర్ణంలో సంవత్సరానికి 3,44,000 క్యూబిక్ మీటర్ల సాధారణ ఇసుక తవ్వకం పై జాయింట్ కలెక్టర్ చిన రాముడు ముఖ్య అతిథిగా సింగవరం సచివాలయం వద్ద గ్రామ ప్రజలతో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు కాలుష్యంపై ప్రజా అభిప్రాయ సేకరణ చేశారు. దీనిలో గ్రామ ప్రజలు ఇసుక రిచ్ ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ చిన రాముడు స్వయంగా సింగవరం గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏ డి, రీ సర్వే డి టి మూర్తి, అర్ ఐ రవి, వి ఆర్ ఓ గంగరాజు, వి ఆర్ ఏ నాని, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల పరిశీలన

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం బీజేపీ అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కడియం మండల ఈఎస్ఐ డిస్పెన్సరీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ప్రైమరీ స్కూల్ మధ్యాహ్న భోజన పథకం, రేషన్ పంపిణీ విధానంను పరిశీలించి, అక్కడ జరుగుతున్న పని తీరును సదుపాయాలను పరిశీలించి అవసరమైన టువంటి మౌలిక వసతులు కొరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దృష్టికి తీసుకువెళ్లి మరిన్ని ఉన్నత సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు చిక్కాల శ్రీనివాస్, గారపాటి తాతబ్బాయి, ప్రధాన కార్యదర్శి దాసరి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

రవాణా ఏజెన్సీలలో తనిఖీలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్న కొరియర్ సర్వీసెస్, రవాణా ఏజెన్సీలపై తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సోదాలలో పోలీస్ జగిలాలు, బాంబులను నిర్వీర్యం చేసే విభాగం, స్థానిక పోలీస్‌లు పాల్గొనుచున్నారు. కొరియర్ సేవలు, రవాణా సేవలు అందించే ఆఫీస్ లలో దీపావళి బాణాసంచ, ప్రేలుడు పదార్థాలు, పేలుడు సంభవించే గుణం గల రసాయనాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి కోసం సోదాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వస్తువులపై ఆరా తీస్తున్నారు. వస్తువులను రవాణా చేసే ముందు పార్సెల్ లేదా బాక్స్‌ల యందు ఏమి ఉన్నది, రవాణాకు ముందుగా తెలుసుకొనిన తరువాత మాత్రమే రవాణా చేయాలని, సరుకు లేదా వస్తువులు పంపిన మరియు చేరవలసిన వారి పూర్తి వివరాలు తెలుసుకోవలసిన భాద్యత రవాణా ఏజెన్సీదేనని ఎస్పీగారు తెలిపినారు. బాణసంచా, పేలే గుణంగల రసాయనాలు, పదార్థాలను, మత్తు, మాదక ద్రవ్యాల వంటి పదార్థాలను రవాణా చేస్తే, రవాణా చేసిన వారు మరియు రవాణా ఏజెన్సీలపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ తెలియచేసారు.

ఇది పట్టభద్రుల విజయం : ఎంపీ

విశాలాంధ్ర - కాకినాడ : శాసనమండలి ఎన్నికలలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడం పట్ల రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో నిరుద్యోగం పెరిగి పోయిన నేపథ్యంలోనే పట్టభద్రులంతా సమిష్టిగా కూటమి అభ్యర్థిని గెలిపించు కున్నారని పేర్కొన్నారు. కూటమిపాలనపై విద్యావంతుల్లో నెలకొన్న సానుకూల దృక్పథానికి ఇది నిదర్శనమని, ఈ విజయం పట్టభద్రులకు అంకితమని అన్నారు. శాసనమండలి తిరిగి ఏర్పడిన తర్వాత ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందడం ఇదే తొలిసారి అని వివరించారు. అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఎంపీ సానా సతీష్ బాబు అభినందనలు చెబుతూ పట్టభద్రులకు, కూటమి నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

మానవత్వం చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో 7,9 తరగతులు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మానవత్వం చాటారు. వారు కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులతో అనాధ వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. సుమారు రూ.5000లు వెచ్చించి చేపల పులుసు, స్వీట్, అరటిపండు, మూడురకాల కూరలతో మంచి భోజనం స్వయంగా వడ్డించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇటువంటి సహాయం చేయుటకు ముందుకు వచ్చిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ పివివి వర ప్రసాద్ అభినందించారు. ప్రతీ నెలా 4 రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రసాద్ తెలిపారు. మిగిలిన తరగతుల విద్యార్థులు కూడా రానున్న రోజుల్లో అనాధ వృద్ధులకు బోజనాలను ఏర్పాటు చేయనున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకొని వృద్ధులకు సహాయం చేయుటకు మిగిలిన వారు ముందుకు రావాలని ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె లక్ష్మీ సునీత, సూర్యనారాయణ, 7,9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

పేరాబత్తులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

విశాలాంధ్ర - రావులపాలెం : ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీగా 77,461 మెజారిటీతో ఘన విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖర్‌కి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ గెలుపు పట్టభద్రుల విశ్వాసానికి నిదర్శనం. ప్రజలకు అంకిత భావంతో సేవ చేయాలని ఆశిస్తూ, వారి నాయకత్వంలో పట్టభద్రులకు మరింత ప్రోత్సాహం లభించాలని కోరుకుంటున్నాం. నుతన బాధ్యతల్లో ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షిస్తూ, గెలుపు సాధించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు.బండారు సత్యానందరావు (కొత్తపేట ఎమ్మెల్యే) ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ విజయంతో విద్యా వంతులకు మంచి ప్రాతినిధ్యం ఏర్పడింది. విద్యా రంగ అభివృద్ధికి ఆయన తన శక్తిమేరకు కృషి చేస్తారని నమ్మ కంతో ఉన్నాం. ఆయన నాయకత్వంలో పట్టభద్రులకు మరింత మద్దతు లభిస్తుందని ఆశిస్తూ, విజయం సాధించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నాం.

హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర - పిఠాపురం : దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన పిఠాపురం పాదగయా క్షేత్రంలోని రాజరాజేశ్వరీ సమేత శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహిం చారు. సిఫెట్ సిహెచ్ రామ్మోహనరావు, ఇన్స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్, జోగా సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వాహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకుని 17 రోజులకుగాను రూ.11,74,660లు హుండీ ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సర హుండీ ఆదాయంతో చూస్తే ఈసారి ఆదాయం బాగా పెరిగిం దని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తబృందం, బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలి

విశాలాంధ్ర - కరప : గ్రామాలలో చెత్తను సేకరించేటప్పుడు చిత్తశుద్ధితో పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కరప మండలం వడ్డిట్టిపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తపై చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. ప్రజలంతా ఈ విషయంలో సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శులు రాంజీ, వీరభద్రరావు బ్రహ్మానందం, చంద్రకళ, నిర్మలాదేవి, వరిజ, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పరీక్షల్లో విజయం తథ్యం

విశాలాంధ్ర - సామర్లకోట : విద్యార్థులు మనసును నియంత్రించుకోవడంతో పాటు ఏకాగ్రతతో సాధన చేయడం ద్వారా పరీక్షల్లో అద్భుత విజయాలు సాధించే వీలుందని విశ్వమానవత సంస్థ ఫౌండర్ చైర్మన్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి పిలుపు నిచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక మున్సిపల్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసెస్ నిర్వహించడం జరిగింది. దీనిలో విశ్వ మానవత సంస్థ తరఫున శ్రీనివాస్ చౌదరి పాల్గొని పలు ఉదాహరణలతో విద్యార్థులను చైతన్య పరిచారు. సాయిరామ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల తన జ్ఞానాన్ని తోటి విద్యార్థులకు పంచుకోవడం ద్వారా మరింత మెరుగు అవుతుంది అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ ఏ చక్రధర్, ఉపాధ్యాయులు వి రాజు, జి గోవిందు, కె అరుణ, కేవీ సత్యనారాయణ, సమస్త ప్రతినిధి పెమ్మాడి వీరభద్ర వర్మ, వీణామాధురి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

యువనేత రాంజీ పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర - కిర్లంపూడి, జగ్గంపేట : మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ సమన్వయ కర్త తోట నరసింహం తనయుడు యువనేత తోట రాంజీ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని వీరవరంలో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రాంజీ తో కేక్‌కట్ చేయించి పూలమాలలు, బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల వైసిపి అధ్యక్షులు రావుల గణేష్ రాజా, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు కాపవరపు ప్రసాద్, కరటూరి వీర్రాజు, గుర్రం మహాలక్ష్మి, వరుపుల సూరిబాబు, నక్కిరెడ్డి విష్ణు, గిడియాల పెద్దకాపు, పోట్రు వీర్రాజు, గాది కృష్ణ, పైలా చైతన్య, వీర్రాజు, సాపిరెడ్డి సత్తిబాబు, మొగిలి శ్రీను మండపాక బాబి, పల్లపాటి రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ, భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ సహాయంతో ఈ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌తో పాటు జనసేన పార్టీ నాయకులు మేడిబోయిన శ్రీను, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మాదారపు వీరబాబు, మొగిలి గంగాధర్ పాల్గొన్నారు.

పేరాబత్తుల గెలుపు

ప్రజా విజయం

విశాలాంధ్ర - గండేపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేసిన పేరాబత్తుల రాజశేఖర్ అత్యధిక మెజా రిటీతో గెలుపొందటం ముమ్మాటికి ఇది ప్రజా విజయమేనని గండేపల్లి మండలం టిడిపి యువ నాయకులు మరియు మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం పేరాబత్తుల గెలుపు అని అన్నారు. పట్టభద్రుల నమ్మకాన్ని పేరాబత్తుల నిలబెట్టుకుంటారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారా నికి ఆయన అంకితభావంతో పనిచేస్తారన్నారు. పేరాబత్తుల గెలుపునకు కృషిచేసిన బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా వసంత్ ధన్యవాదాలు తెలియ జేశారు.

పదివేల మందికి అన్నదానం

విశాలాంధ్ర - కరప : కరప మండలం సిరిపురం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు చిక్కాల దొరబాబు సాయిబాబా 24వ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని స్వగ్రామంలో పదివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ప్రతాలలో పాల్గొన్న ముత్తయి దులకు 2000 మందికి చీరలు పంపిణీ చేయుట జరిగింది. సాయిబాబా విగ్రహానికి బంగారు కిరీటం అలంకరించి అంగరంగ వైభవంగా పూజలు ప్రతాలు చేయించారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు స్వగ్రామం కావడంతో వేలాదిగా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా బాబా వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

నూతన జీవో ఆధారంగా దేవుడు భూమి స్వాధీనం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : అన్యాక్రాంతమైన దేవాదాయ భూమి నూతన జీవో ఆధారంగా స్వాధీనం చేసుకోవచ్చని జిల్లా ఎండోమెంట్ అధికారిని దుర్గాభవాని అన్నారు. మండలంలోని గోరస గ్రామంలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి సంబంధించి ఉన్న భూమి అన్యాక్రాంతం కావడంపై గ్రామస్తులు మంగళవారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలవడం జరిగింది. ఆయన ఆదేశాల మేరకు జిల్లా ఎండోమెంట్ అధికారిని దుర్గాభవాని భూములను పరిశీలించారు. భూములు ఆక్రమణగురి కావడంపై స్థానిక గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోరస గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 121, 122లో ఉన్న 19.92 ఎకరాల భూమికి భూమి అన్యాక్రాంతం కావడంపై ఎండోమెంట్ అధికారులు ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించడం జరిగింది. కొత్త జీవో ప్రకారము ఎండోమెంట్ కోర్టులో ట్రిబ్యునల్ ఉపసంహరించుకుంటే రైతులకు నోటీసులు ఇచ్చి ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, రికార్డులను పరిశీలించి నివేదికను డిప్యూటీ కమిషనర్‌కు అందించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్ళూరు మరియు జెడ్ రాగంపేట గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్‌లో ఇప్పటి వరకు మన మండలం 6390 నమోదు అయ్యిందని, ఇంకా సుమారు 1000 చేయాల్సివుంది అని రైతులు త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ రబీ-24-35 పంటలో కోత అనంతరం పచ్చిరొట్ట పైరులు, అపరాలు సాగు చేయాలి అని వాటివల్ల భూమికి బలం చేకూరి భూమిలోపల సహాయక సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈఓ చంద్రమౌళి, వివిఏ పృధ్వి, సురేఖ పాల్గొన్నారు.

'ఆర్ట్ అండ్ టెక్నిక్ ఆఫ్ కమ్యూనికేషన్'పై సూచనలు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ఐడియల్ కళాశాల ఆర్ట్ అండ్ సైన్సెస్ (ఎ), కాకినాడలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'ఆర్ట్ అండ్ టెక్నిక్ ఆఫ్ కమ్యూనికేషన్' అనే అంశంపై వివిధ విభాగాల్లో ముఖ్య అతిథులు విలువైన, సూచనలు, సలహాలు, మార్గదర్శకాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా కీనోట్ అడ్రస్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా పి చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని మారుతున్న కాలానికి అనుగుణంగా భాషా సామర్థ్యమును పెంచుకోవడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ, రాజమండ్రి ప్రొ కె ఎస్ రమేష్ కార్యక్రమమును ఉద్దేశించి పవర్పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చక్కని విషయాలు బోధించారు. ఇంగ్లీషు అనేది ఒక సబ్జెక్ట్ కాదని ఒక భాష అని పేర్కొన్నారు. ఆలోచనలు, భావాలు ఎదుటివారికి అర్థంకావాలంటే భాషను నిరంతర అధ్యయనం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. ఇందుకోసం ఫ్రీడమ్ ఫైటర్స్, కథలు, నవలలు, న్యూస్ పేపర్లు, పుస్తకాలను విస్తృతంగా అధ్యయనం చెయ్యాలన్నారు. అప్పుడే కమ్యూనికేషన్‌లో చక్కని కళ, సాంకేతికత లభించి విద్యార్థులను తీర్చి దిద్దవచ్చని పేర్కొన్నారు. మరొక ముఖ్య అతిథి ఆదిత్య డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఎల్వి ప్రసాద్ మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా భాష మెళుకులను బోధించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా టి సత్యనారాయణ అధ్యక్షత వహించగా, కళాశాల ఆంగ్ల విభాగాధిపతి యు నానిబాబు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమమునకు హాజరైనవారిలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జివి కృష్ణంరాజు, చింతపల్లి సుబ్బారావు, సిద్ధార్థబాబు, స్వరూప్, డా స్టీవెన్ రాజు, వి కామరాజు, వి నాగేశ్వరరావు, డా కె స్వామిజి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నిర్వాహణ ఆదిత్య యూనివర్సిటీ

విశాలాంధ్ర - గండేపల్లి : తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కోనసీమ, అల్లూరి సీతారామ రాజు, యానాం జిల్లాల స్థాయి 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025' నిర్వహించడానికి నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్సిటీను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది అని యూనివర్సిటీ ప్రొ ఛాన్సలర్ ఎన్ సతీష్‌రెడ్డి తెలిపారు. నోడల్ సంస్థగా ఆదిత్యను ఎన్నిక చేసినందుకు యూనివర్సిటీ డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎంబి శ్రీనివాస్, ప్రొ వైస్ ఛాన్సిలర్ డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన వలసిన వారు 18 నుంచి 25 సంవత్సరాలు పూర్తి అయిన వారు పాల్గొనవచ్చు ముందు ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా mybharat.gov.in పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ జిల్లాల వాళ్ళు మై భారత్ పోర్టల్‌లో కాకినాడ జిల్లాగా ఎంచుకోవాల్సింది, రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏ భాషలోనైనా What does Viksit Bharat mean to you? అనే అంశం పై ఒక నిమిషం కలిగిన వీడియో Viksit Bharat linkలో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. నమోదు అయినవారిలో 150 మందిని స్క్రీనింగ్ చేసి వారికి ఆదిత్య యూనివర్సిటీలో పోటీలు నిర్వహించి 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి పంపు తారని జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డీన్ ప్రొఫెసర్ వి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికా రులు బి రాంబాబు, ఐవి రామాంజనేయులు తెలిపారు. నమోదు ప్రక్రియలో సహాయం కొరకు 7729990278, 9000156734 సంప్రదించాలని తెలిపారు.

హైస్కూల్ విద్యార్థుల విజయకేతనం

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ సత్య సాయి సేవ ఆర్గనైజేషన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొంకాపల్లి జెఎన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినీలు విజయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి 10వ తరగతి విద్యార్థిని జి గాయత్రి, ద్వితీయ బహుమతి 9వ తరగతి విద్యార్థి పెద్దిరెడ్డి వేద్యశ్రీ, తృతీయ బహుమతి 10వ తరగతి విద్యార్థి కర్రా మహాలక్ష్మిలు బహుమతులు సాధించారు. కొంకాపల్లి జెఎన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినీలకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీం భాషా అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, 20 వార్డు కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, డివై ఈఓ జి సూర్య ప్రకాశం, ఎంఈఓ ఎస్ దుర్గాదేవి, మున్సిపల్ కమిషనర్, కెవి రాజేశ్వర రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే ఘన సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వాసపల్లి ముక్కోటి రాంబాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెవిఎన్ వెంకటేశ్వరరావు, నిర్మల, డి నాగేంద్ర రాజు పాల్గొన్నారు.

60 సంవత్సరాలకే ఆశవర్కర్లకు రిటైర్మెంట్ ఇవ్వాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : 60 సంవత్సరాలు నిండిన ఆశ వర్కర్లకు రిటైర్మెంట్ ఇచ్చి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్ డిమాండ్ చేశారు. జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 113 జీవో విడుదల చేశారన్నారు. ఆ జీవోలో 60 సంవత్సరాలు నిండిన ఆశ వర్కర్లకు రిటైర్మెంట్ ఇవ్వాలని చెప్పారని గుర్తు చేశారు. ఆ జీవోను అధికారులు పక్కన పెట్టి 60 ఏళ్లు దాటిన వారితో ఇంకా పని చేయిస్తున్నారన్నారు. వారి వద్ద అధికారులు, సీఐటీయూ నాయకులు నెలనెలా డబ్బులు తీసుకుని రిటైర్మెంట్ ఇవ్వకుండా వారినే కొనసాగిస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 400 మంది వయస్సు మళ్ళిన వారు ఉన్నారని వారందరినీ తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నారు. అలాగే కాట్రావులపల్లి పిహెచ్‌సీ పరిధిలో 67 సంవత్సరాలు వచ్చిన వారు విధులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆశా వర్కర్ల వయసు నిర్ధారణ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని పులి ప్రసాద్ డిమాండ్ చేశారు.

పశువుల పాక దగ్ధం.. పశువు మృతి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్ల కోట మండలం వీకే రాయపురం గ్రామంలో ఒక పశువుల పాక అగ్ని ప్రమాదం సంభవించి దగ్ధం అయ్యింది. ఒక గేదె మృతి చెందింది. రంగనాథం వీరభద్రరావు అనే రైతుకు అయిదు గేదెలు ఉండగా వాటిని పశువుల పాకలో సోమవారం రాత్రి కట్టి ఉంచగా దానికి అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా మిగిలిన నాలుగు పశువులు క్షేమంగా ఉన్నాయి. అయితే ప్రమాదానికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 08 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలోని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..ఐసీడీఎస్, జిల్లా పరిషత్, పంచాయతీ, వైద్య ఆరోగ్యం, పోలీస్, జిల్లా గ్రామీణాభివృద్ధి ఇతర శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళల, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారత ప్రత్యేక అంశంగా ఐక్యరాజ్యసమితి ఈ 2025 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వారం రోజులు పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5న పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న కౌమార బాలికలకు కెరీర్ కౌన్సిలింగ్, అవగాహన కల్పించడం, ఒత్తిడి లేని నిర్వహణ, ప్రస్తుత ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లు, అవకాశాలుబీ 6న వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సత్కరించడం, మహిళల అక్షరాస్యత, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మహిళలు రాణించేలా చేయడంబీ 7న మహిళల హక్కులు పీసీపీఎన్డిటి, ఇతర చట్టాలపై అవగాహన, 2కె మారథాన్‌బీ 8న జిల్లాస్థాయి మహిళా దినోత్సవం నిర్వహణ వంటి కార్యక్రమాలు అన్ని సక్రమంగా నిర్వహించేందుకు వివిధ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎంజేవీ. భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ కె విజయ కుమారి, డీఆర్డీఏ ఇంచార్జ్ పీడీ ఎ శ్రీనివాసరావు, డీఎం అండ్ హెచ్ఓ డా జె నరసింహ నాయక్, జడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డీపీవో వి రవికుమార్, ఎల్డీఎం సి హెచ్ఎస్వి ప్రసాద్ ఇతరాధికారి పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా పాలన

విశాలాంధ్ర - జగ్గంపేట : రాజ్యాంగ విరుద్ధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన పదవికి రాజీనామా చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురామ్ డిమాండ్ చేశారు. జగ్గంపేటలో ఆయన మీడియా సమావేశం నిర్వ హించి చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగ బద్ధంగా పదవి పొందిన చంద్రబాబు మొన్న జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులకు మేలు చేసే పనులు చేయొద్దని, అలా చేస్తే పాముకు పాలు పోసినట్లే అని పేర్కొనడం రాజ్యాం గాన్ని అతిక్రమించడమే అవుతుం దన్నారు. దానికి బాధ్యత వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు తన పదవికి రాజీ నామా చేయాలన్నారు. కూటమిలో అధికారం పంచుకున్న జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ ఇప్పటికి స్పందించలేదన్నారు. రాజ్యాంగ విరుద్ధాన్ని సమర్ధిస్తూ వారు పాలన అందించనున్నారా అని ప్రశ్నించా. ముఖ్యమంత్రి అంటే అందరి వాడుగా ఉండాలని, కొందరి వాడుగా కొనసాగడం రాజ్యాంగ విరుద్ధం. సిఎం రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి విన్నవించారు. ఈ మేరకు మంగళగిరి టీడీపీ కేంద్రకార్యాలయంలో కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం, దాసరి ఉమాదేవిలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి లోకేష్ దృష్టికి విషయం తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'పేరాబత్తుల' గెలుపు చరిత్రాత్మకం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం చరిత్రాత్మకమని కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. వలసపాకల గ్రామంలో కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణమూర్తి, అనంత లక్ష్మి నివాసం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మొదటి ప్రాధాన్యత ఓట్ల తోనే అత్యధిక మెజారిటీతో గెలవడం పై హర్షం వ్యక్తం చేస్తూ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి మాట్లాడుతూ..ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి కూటమి అభ్యర్థి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 77,461 మెజార్టీతో అఖండమైన గెలుపు సాధించడం చరిత్రాత్మకమని అన్నారు. కూటమి పాలనపై విశ్వాసంతోనే ప్రజలందరూ ఏకమై రాజశేఖరంకు ఘన విజయాన్ని అందించారని అన్నారు. ఈ గెలుపులో కీలకంగా క్లస్టర్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు, పిఓసీ లు వ్యవహరించారని అన్నారు. ప్రతీ 30మంది పట్టభద్రులకు ఒక నాయకుడికి బాధ్యతలు అప్పగించామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే మెగా డీఎస్సీ ద్వారా 16,337 టీచర్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. తల్లికి వందనం విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తారని అన్నారు. అధినేతలు చంద్రబాబు,లోకేష్, మా పిలుపును శిరసావహించి నాడు కూటమి ఎంఎల్‌సి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని నేడు కార్యకర్తలు, నాయకులు సుమారు మూడు నెలల పాటు అహర్నిశలు 'పేరాబత్తుల' కోసం శ్రమించి కష్టపడ్డారని, వారు పడ్డ కష్టం వలనే పట్టభద్రుల వివరాలు లభ్యమయ్యాయని, వారి ఇండ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించడానికి వీలు కుదిరిందని కొనియాడారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులను ఓడించాలని తెరవెనుక కుట్రలు చేసి జగన్ చతికిలపడ్డాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో రాజ్యసభ ఎంపీగా సానా సతీష్, ఎమ్మెల్సీగా పేరబత్తుల రాజశేఖరం గెలుపొందడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. కాకినాడ రూరల్ నియోజక వర్గంలో సుమారు 9వేల ఓట్లు పోలయ్యాయని, నియోజకవర్గంలోని కరప మండలంలో సుమారు 74% కాకినాడ రూరల్‌లో సుమారు 61% ఓట్లు పోలయ్యాన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

విశాలాంధ్ర - యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలలో సుమారు 23 సంవత్సరాలుగా మిల్క్ బాయిలర్లుగా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక పరిపాలనాధి కారి కార్యాలయం జెండా స్థంభం వద్ద రాజీవ్ గాంధీ అల్పాహార పథకం ద్వారా పనిచేస్తున్న సిబ్బంది ఆందోళన చేపట్టారు. పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ పాఠశాలలో పని చేస్తున్న వందలాది మంది సిబ్బంది తమకు పదివేల నుంచి 18 వేలు వేతనాలు పెంచుతూ గత ఏడాది ప్రభుత్వం చేసిన ప్రకటన ఇప్పటికీ అమలు కాకపోవడంతో పుదుచ్చేరి వ్యాప్తంగా మిల్క్ బాయిలర్ చేపట్టిన ఆందోళనలో భాగంగా యానాంలోని సిబ్బంది ఈ ఆందోళన చేపట్టారు. 18 వేలు వేతనాలు పెంచకపోగా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టి చాకిరి చేయిస్తున్నారని పెంచుతానన్న వేతనాలకు పలు నిబంధనలు పెట్టడం సరికాదని, తక్షణమే వేతనాలు పెంచి తమ సర్వీస్ని క్రమబద్ధకరించి, డైలీ రేట్ చేయాలని కోరుతూ డిమాండ్ చేశారు. పాఠశాలలో ఉదయం 10 గంటల వరకు విధులు నిర్వహించి అనంతరం సాయంత్రం ఐదు గంటల వరకు ఆందోళనలో పాల్గొన్నారు.

రేపే గురుకుల ప్రవేశాలకు ఆఖరు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సి, ఎస్టీ, బిసి విద్యార్థులకు గురుకులంలో విద్య గొప్ప వరం వంటిదని ఆమె అన్నారు. ఈ అవకాశాన్ని ఆయా సామాజికవర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న బాలయోగి గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పిఠాపురం : నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం చేబ్రోలు పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 14న జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆవిర్భావ సభకు పిఠాపురం నియోజవర్గ పరిశీలకులుగా దాసరి రాజు, పిఎన్ రాజులను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించినట్లు ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ గ్రామాల వారిగా సమావేశాలు నిర్వహించి జనసేన పార్టీ అధికారం చేపట్టిన తర్వాత జరుపుకునే మొదటి పండుగను ఘనంగా జరుపుకోవాలని తెలియజేశారు. చోడవరం ఇంచార్జ్ పిఎన్ రాజు మాట్లాడుతూ ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే కమిటీలు నియమించడం జరిగిందని, ఈ కమిటీలతో పాటు ఆహ్వాన కమిటీని కూడా ఏర్పాటు చేశామని, మీరందరూ సమన్వయంతో పనిచేసి ఆవిర్భావ సభను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కూటమి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం పోటీ చేసి 1,24,702 (62.59%) ఓట్లు సాధించి, 77,421 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించడంతో చేబ్రోలు జనసేన పార్టీ అధ్యక్షుడు, పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నివాసంలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖరం గెలుపుకు కృషి చేసిన ప్రతీ ఒక్క జనసేన నాయకుడికి, కూటమి నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఒరిజినల్ 'డి. పట్టా' పోయినది

కొండవీటి సంధ్య, D/o. (లేటు) శ్యాంప్రసాద్ అను నేను తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, కడియం గ్రామానికి చెందిన వారము. కడియం గ్రామంలో మా నాన్నమ్మ (లేటు) కొండవీటి శిరోమణి కు చెందిన Bearing No. B2 LD2/85 గల డి.పట్టా మా ఇంటినుండి జిరాక్స్ షాపుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల మాకు అందజేయవలసినదిగా కోరుతున్నాము.

కొండవీటి సంధ్య,
D/o. (లేటు) శ్యాం ప్రసాద్,
ఇంటి నెంబర్ 15-92, కడియం (మండలం)
రాజమండ్రి రూరల్, సెల్ : 63041 23022.

పరిశ్రమల సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల స్థితిగతులపై క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వేను వేగవంతం చేసి 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. వేసవి కార్యచరణ ప్రణాళిక, వర్క్ ఫ్రం హెూం, ఎంఎస్ఎంఈ, గ్రామ/వార్డు సచివాలయాల హౌస్ హెూల్డ్ సర్వేల పురోగతిపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జిల్లా ప్రజా పరిషత్, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యం, పరిశ్రమల శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సర్వేల నిర్వహణ, చిన్నారులకు ఆధార్ నమోదు వంటి అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జరిగే ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా వ్యాపారాలకు సంబంధించి ప్రతి షాపు, పరిశ్రమల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేసి, ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేకు సంబంధించి 78,299 లక్ష్యంగాను ఇప్పటివరకు 73, 330 పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన సర్వే ప్రక్రియను వేగవంతం చేసి మార్చి15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు వర్క్ ఫ్రం హెూం, గ్రామ /వార్డు సచివాలయాల్లో హౌస్ హెూల్డ్ సర్వేలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామస్థాయిలో ఉన్న సచివాలయం సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఈ సర్వేల్లో పురోగతి కనబరచాలన్నారు. వేసవి తాగునీరుకు సంబంధించి అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తతో వ్యవహరించి ఎక్కడ తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. 0-5 సంవత్సరాల లోపు చిన్నారులందరికి ఆధార్ సంఖ్య నమోదు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు షణ్మోహన్ అధికారులకు సూచించారు. సమావేశంలో జేడీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, డీఎం అండ్ డా నరసింహ నాయక్, పరిశ్రమల శాఖ డీఎం పీహెచ్ గణపతి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ ఎన్ భారతి ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు వాహన మిత్ర ఇవ్వాలని నిరసన

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామన మూర్తి పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 మాసాలు గడుస్తున్నా ఆటో కార్మికులకు వాహన మిత్రా రూ. 15 వేలు ఇవ్వలేదని, సుదీర్ఘకాలంగా ఆటో కార్మిక కుటుంబాలు కోరుకుంటున్న ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వాసంశెట్టి సత్తిరాజు రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2014 రోడ్ ట్రాన్స్పోర్ట్ యాక్టు అమలు చేస్తు గత ప్రభుత్వం తీసుకొచ్చిన 106(1ఐ2)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన గ్యాస్ మనకే అనే నినాదంతా ఆటోలకు జిల్లా వ్యాప్తంగా సియన్‌జి గ్యాస్ కిట్లను ఏర్పాటు చేసి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వారిని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నామని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు, రవాణా ఖర్చులు పెరుగుదలను అరికట్టేందుకు డిజిటల్, పెట్రోలు ధరలు జిఎస్‌టి పరిధిలోకి తీసుకు రావాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాసం శెట్టి శ్రీనివాసరావు, ఈ కార్యక్రమానికి ఏఐటి యుసి డివిజన్ కమిటీ సభ్యులు బొలిశెట్టి శంకరం మోకా శ్రీను, కాళ్ల భీమరాజు, మట్టపర్తి ప్రసాద్, పేరు రాంబాబు, బొక్క మంగరాజు, రొక్కల సత్యనారాయణ, లక్ష్మణ్, రాయుడు, సత్యనారాయణ, బందారు శ్రీను మరియు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అన్నీ తానై... ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో కలెక్టర్

- నిరంతరాయంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కలెక్టర్
- పోటీలో 35 మంది అభ్యర్థులు... జంబో బ్యాలెట్ పేపర్....
- జిల్లా కలెక్టర్ స్వీయ పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ

విశాలాంధ్ర ఏలూరు: ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నీ తానై సమర్థవంతంగా నడిపించారు. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఏలూరులోని సర్. సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమై, మంగళవారం మధ్యాహ్నం వరకు జరిగింది. బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించడంతో బ్యాలెట్ పత్రాలతో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు అత్యంత క్లిష్టమైనది. పోటీలో 35 మంది అభ్యర్థులు, అంతమంది పేర్లతో కూడిన 'జంబో ' బ్యాలెట్ పేపర్.ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభం నుండి జిల్లా కలెక్టర్ కౌంటింగ్ సిబ్బందితో ఎక్కడా ఏ పొరపాటు జరగకుండా ఓట్ల లెక్కింపును సునిశితంగా పర్యవేక్షించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ సిబ్బందిని సమాయత్త పరచడం... స్ట్రాంగ్ రూంల నుండి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలులోకి సిబ్బంది తీసుకువచ్చిన తరువాత ఏ టేబుల్‌కు కేటాయించిన పోలింగ్ స్టేషన్ కు సంబందించిన బ్యాలెట్ బాక్స్ అదే టేబుల్‌కి వెళ్ళింది, లేనిదీ అని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులలో బ్యాలెట్ పత్రాలను లెక్కింపు, డ్రంలో వేయడం...వారిలో చెల్లినవి, చెల్లని ఓట్లను వేరుచేసే కార్యక్రమం, చెల్లిన, చెల్లని ఓట్లను ఏజెంట్లు చూపి, వాటిని లెక్కింపు బాక్సులలో వేసి, ప్రాధాన్యతా ఓట్లను లెక్కించేవరకు అన్ని అంశాలలో ప్రతీ పనిని జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్నీ తానై నడిపించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఎక్కువ సమయం పడుతుందని ఊహించినప్పటికీ, జిల్లా కలెక్టర్ చొరవ, అలుపెరగని పర్యవేక్షణతో ఊహించిన సమయం కంటే ముందుగానే ఓట్ల లెక్కింపు కార్యక్రమం ముగిసింది. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,డి ఆర్ ఓ వి.విశ్వేశ్వర రావు ఎన్నికల నిర్వహణలో సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా కర్తవ్య బాధ్యత నిర్వహించారు. ఎన్నికల మీడియా సెంటర్‌లో పాత్రికేయులకు సరైన సదుపాయాలు ఉన్నాయి లేదా అని మీడియా సెల్ సందర్శించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు.

రాజా సమాధి వద్ద ఎమ్మెల్యే సత్య ప్రభ నివాళి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ వరుపుల రాజా ద్వితీయ వర్ధంతి సందర్భంగా రాజా స్వగ్రామమైన పెదశంకర్లపూడి గ్రామంలో రాజ సమాధి వద్ద రాజా సతీమణి ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ కుటుంబ సభ్యులతో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలో టిడిపి శ్రేణులు రాజాసమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం రాజా చేసిన సేవలను కొనియాడారు. రాజా సమాధి వద్ద టిడిపి శ్రేణులు రాజా లేని లోటు తీర్చలేనిది అన్నారు. రాజా ద్వితీయ వర్ధంతి సందర్భంగా నియోజక వర్గంలో ప్రత్తిపాడు, రౌతులపూడి, ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్తిపాడులో రాజా విగ్రహానికి టిడిపి శ్రేణి ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో టిడిపి నాయకులు వెన్నా శివ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించి రాజా చేసిన సేవలను కొనియాడారు. టిడిపి శ్రేణులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, వెలుగుల నాని, ఇల్లా అప్పారావు, అంబటి బుజ్జి, పల్లా గోపి, సత్యం శెట్టి సీతబాబు, తదితరులు పాల్గొన్నారు. :

పట్టభద్రులకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు మాట్లాడుతూ పట్టభద్రులకి జరిగిన ఎన్నికల్లో మొదటి సారి ఎటువంటి ప్రలోభాలు లేకుండా జరగడం, యువత కూటమి ప్రభుత్వంకు మద్దతుగా నిలవడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరంకు అత్యంత మెజారిటీ ఇచ్చి గెలిపించిన కూటమి సభ్యులకి, యువతకు కృతజ్ఞతలు, శాసనమండలిలో యువత తరుపున మాట్లాడే అవకాశం ద్వారా మీ అందరికీ మరింత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజశేఖరం కృషి చెయ్యాలి అన్నారు. జనసేన తరుపున విళ్ళ వీర వెం ఆదినారాయణ, బిజేపీ తరుపున దత్తాత్రేయ, భాస్కరరాజు, మోపూరి వెంకటేశ్వ రరావు, కట్టా త్రిమూర్తులు, పుణ్యమంతుల సత్తిబాబు, గంజా సూరి బాబు, రొళ్ళ చక్రవర్తి, నిమ్మకాయలమూర్తి, బందారు దొర బాబు, దందు రాజు, టేకుమూడి వీవెం సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్రేక్స్ ఇండియా రెవియా యూటీటీఓ ఆయిల్ ప్రారంభం

విశాలాంధ్ర- భీమవరం: ట్రాక్టర్ వెట్ బ్రేక్ సిస్టమ్స్ కోసం ప్రముఖ ఒరిజినల్ ఎక్విప్మెంట్ తయారీదారు (ఓఈయమ్) బ్రేక్స్ ఇండియా (టిఎస్ఎఫ్ గ్రూపులో భాగం) మంగళవారం రెవియా యుటిటిఓ (యూనివర్సల్ ట్రాక్టర్ ట్రాన్స్మిషన్ ఆయిల్) ప్రారంభించడంతో ట్రాక్టర్ ఆయిల్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఈ వ్యూహాత్మక చర్య పెరుగుతున్న ట్రాక్టర్ విభాగంలో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుంది, దాని రెవియా బ్రాండ్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తుంది. రెవియా యూటీటీఓ అనేది ప్రసార వ్యవస్థలు, తడి బ్రేక్‌లు, హైడ్రాలిక్స్ మరియు ఆధునిక ట్రాక్టర్ల తుది డ్రైవ్‌లలో ఉపయోగం కోసం అధిక-పనితీరు గల సార్వత్రిక కందెన. మృదువైన, శబ్దం లేని బ్రేక్ కార్యకలాపాలను అందించడానికి రూపొందించ బడిందని బ్రేక్స్ ఇండియా ప్రతినిధి సుజిత్ నాయక్ వెల్ల డించారు. రెవియా యూటీటీఓ ఏపీఐ జీఎల్4 ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందన్నారు.